క్లుప్తంగా

సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి



రేపల్లె: ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్ పేర్కొన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. సోలార్ విద్యుత్‌ను గ్రామీణ ప్రాంత ప్రజలకు చేరువ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం సూర్య ఘర్ పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి 300 యూనిట్ల వరకు విద్యుత్ సరఫరా చేసే సోలార్ ప్యానల్‌ను పెట్టుకునేందుకు సబ్సిడీని అందిస్తుందన్నారు. యూనిట్ కాస్ట్ రూ 2.10లక్షలు కాగా లబ్ధిదారుడు రూ.20వేలు చెల్లిస్తే చాలని, రూ 78వేలు సబ్సిడీ, రూ 1.12 లక్షలు బ్యాంకు లోన్ ద్వారా అందించబడుతుందన్నారు. సమావేశంలో ఎంపీపీ సుశీల, ఎంఈఓ రత్నశేఖర్, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జాబ్‌మేళాలో 77 మందికి ఉద్యోగాలు



వేమూరు: జాబ్ మేళా ద్వారా 77 మందిని ఎంపిక చేయడం జరిగిందని జిల్లా ప్లేస్మెంట్ అధికారి బి.శ్రీనివాసరావు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన జాబ్‌మేళాకు 163 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారన్నారు. వారిలో 77 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. జాబ్ మేళాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.గాయత్రి, ఏపీఎస్ఎస్‌డీసీ కో–ఆర్డినేటర్ రాజేశ్వరి, హరిష్, సీడీ అఫ్ జేసీ జాబ్ కో–ఆర్డినేటర్ అరుణ్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బడిబాట ర్యాలీ



చుండూరు(వేమూరు): ప్రజలు తమ పిల్లలను పనులకు పంపించడం మానివేసి చక్కగా చదివించాలని ఉపాధ్యాయుడు బట్టు వెంకయ్య అన్నారు. చుండూరు మండలంలోని నడిగడ్డవారి పాలెం గ్రామంలో మంగళవారం బడి బాట ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బట్టు వెంకయ్య విద్య చిన్నారుల హక్కని, వారిని చదివించడం తల్లిదండ్రుల బాధ్యతన్నారు. అందరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపాలని కోరారు. పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు గణేశుడి సన్నిధిలో ఏరువాక పూజలు

కొల్లివర: మండల పరిధిలోని వల్లభాపురం గ్రామంలోని శ్రీ వినాయక స్వామి దేవాలయంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం ఉదయం 11 గంటలకు గ్రామంలో పంటలు సమృద్ధిగా పండాలని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త అచ్యుత ఇందు శేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులందరికీ పంటలు బాగా పండాలని, గ్రామం సుభిక్షంగా సుసంపన్నం కావాలని, ఎలాంటి ప్రకృతి అవాంతరాలు లేకుండా, గ్రామంలోని వ్యవసాయ భూములు సారవంతం కావాలని వినాయక స్వామి వారి ని అర్థిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. గ్రామంలోని రైతులంతా దేవాలయం కు విచ్చేసి ఏరువాక ప్రత్యేక పూజలులో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. పూజా కార్యక్రమాల అనంతరం దేవాలయం ప్రాంగణంలో సాంప్రదాయ, సనాతన, ప్రాచీన విధానంలో వ్యవసాయం చేస్తున్న రైతులనూ, ఆ ఎడ్ల జతలనూ గౌరవిస్తూ సత్కార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలి

తెనాలిఅర్బన్: వైద్య ఆరోగ్యశాఖలో జరగనున్న సాధారణ బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.శ్యామ్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 15న సాధారణ బదీలలకు అనుమతించిదని గుర్తు చేశారు. దీనిలో భాగంగా గత నెల 31న వైద్య ఆరోగ్యశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ గైడ్‌లైన్స్ జారీ చేసినట్లు చెప్పారు. దాని ప్రకారం బదిలీలు చేయాల్సి ఉందని తెలిపారు. కానీ అధికారులు ఇప్పటి వరకు సీనియార్టీ లిస్టును ప్రకటించలేదని ఆరోపించారు. అలాగే ఉద్యోగుల అభ్యంతరాలను పరిగణన లోకి తీసుకోవాలని కోరారు. ప్రలోభాలకు తావులేకుండా బదిలీలు జరపాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ చౌర్యానికి పాల్పడితే చర్యలు

- విద్యుత్‌శాఖ బాపట్ల సర్కిల్ పర్యవేక్షణ ఇంజినీరు జి.ఆంజనేయులు
- చెరుకుపల్లి మండలంలో 155 మందికి రూ.4,85,000 అపరాధ రుసుము విధింపు



విద్యుత్ చౌర్యానికి పాల్పడిన వారి వివరాలు తెలియజేస్తున్న విద్యుత్ విజిలెన్స్ అధికారులు

చెరుకుపల్లి: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే శాఖ పరమైన చర్యలు తప్పవని బాపట్ల సర్కిల్ పర్యవేక్షణ ఇంజినీరు జి.ఆంజనేయులు హెచ్చరించారు. మండలంలోని పొన్నపల్లి, గూడవల్లి, కనగాల, రాజవోలు, రాంబొట్లపాలెం గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఆపరేషన్ విభాగం సంయుక్తంగా మంగళవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పర్యవేక్షణ ఇంజినీర్లు ఆంజనేయులు, విజయ్ కృష్ణ ఆధ్వర్యంలో విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు ఎం.భాస్కరావు, జి.భాస్కరావు నేతృత్వంలో 46 బృందాలుగా ఏర్పడి 3250 విద్యుత్ సర్వీసులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో అనుమతించిన లోడుకు మించి విద్యుత్ వినియోగించిన 155 మందికి రూ 4,85,000 అపరాధ రుసుము విధించారు. విద్యుత్ అధికారులు మాట్లాడుతూ వినియోగదారులు తమ ప్రాంగణంలోని విద్యుత్ మీటర్లకు సీలు సరిగా ఉందో లేదో నిర్ధారించుకోవాలని సూచించారు. ఒకవేళ సీలు ఊడిపోయినా, తుప్పుపట్టి తొలగిపోయినా వెంటనే విద్యుత్ అధికారులకు తెలియపరచాలని కోరారు. మీటర్లకు సీలు లేకపోవటం, గాట్లు పెట్టడం వంటివి గమనిస్తే విద్యుత్ చౌర్యంగా పరిగణిస్తారని తెలిపారు. మొదటి సారి అలాజరిగితే అట్టి వారికి అపరాధ రుసుము విధిస్తామని, రెండవ సారి పట్టుబడితే అరెస్టు చేసి జైలుకు పంపటం జరుగుతుందని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా విద్యుత్ చౌర్యానికి పాల్పడితే 7780456319, 8331024029 నెంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ తనిఖీల్లో చెరుకుపల్లి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.సురేష్ బాబు, బాపట్ల డివిజన్ లోని పొన్నూరు, బాపట్ల ఏడీ లు ఏఈలు వారి సిబ్బంది పాల్గొన్నారు.

దళితవాడలపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వరికూటి అశోక్‌బాబు



మోదుకూరు దళితవాడలోని స్మశాన వాటిక రహదారిని పరిశీలిస్తున్న అశోక్‌బాబు

చుండూరు(వేమూరు): నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోని దళితవాడల్లో స్మశాన వాటికల రహదారుల గురించి కూటమి ప్రభుత్వం పట్టించుకోవడమే మానేసిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు పేర్కొన్నారు. చుండూరు మండలంలోని మోదుకూరు దళితవాడ స్మశాన వాటిక రహదారిని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటినుంచి దళితుల పట్ల, వారి సమస్యల పట్ల చిన్నచూపుతో వ్యవహరిస్తోందన్నారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయకుండా, వాటి అమలుపై ప్రజలు ప్రశ్నించకుండా డైవర్షన్ రాజకీయాలకు చంద్రబాబు తెరతీశారన్నారు. దానిలో భాగమే కొమ్మినేని అక్రమ అరెస్టు, సాక్షి కార్యాలయాలపై దాడులన్నారు. మీడియా వ్యవస్థను భయభ్రాంత్రులకు గురి చేసేందుకు కొమ్మినేని శ్రీనివాసరావుపై అక్రమ కేసులు నమోదు చేశాన్నారు. పార్టీ చుండూరు మండల అధ్యక్షుడు అనపురెడ్డి రాఘరామి రెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు దుర్మార్గం



విలేకర్ల సమావేశంలో మట్లాడుతున్న గొట్టిముక్కల బాలాజీ, చిత్రంలో వెంకట్‌రావు తదితరులు

చెరుకుపల్లి: విశాఖ ఉక్కు పరిశ్రమలో ఎప్పటి నుంచో పనిచేస్తున్న 5400 మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించడం దుర్మార్గమైన చర్య అని సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టిముక్కల బాలాజీ, సీపీఐ(ఎంఎల్)నాయకుడు మరివాడ వెంకట్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని చెరుకుపల్లి లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖ ఉక్కు పోరాటంపై తీవ్ర ఆంక్షలు విధిస్తూ ఉక్కు పరిశ్రమ లోపల పోలీసులను మోహరించి పోరాడే కార్మికులపై నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ నినాదాలకు కూటమి ప్రభుత్వం డూడూ బసవన్నలా తల ఊపుతూ ప్రజాస్వామిక పోరా టాన్ని అడ్డుకుంటూ రాష్ట్ర ప్రజలు చేసిన ప్రాణత్యాగాలను అవమానిస్తున్నారని దుయ్యబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి ఇలాగే కొనసాగితే రాష్ట్ర ప్రజలు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ప్రభుత్వ పునరాలోచించి తొలగించిన 5400 మంది కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, విశాఖ ఉక్కు పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలని, ప్రైవేటీకరణ విధానాలను విడనాడాలని వారు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు బండారు శ్రీనివాసరావు, వీర ప్రసాద్, పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు తీసుకుంటాం

డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ



మాట్లాడుతున్న డాక్టర్ అన్నపూర్ణ

తెనాలిఅర్బన్: గర్భస్థ లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెనాలి డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ ఈరుగుల అన్నపూర్ణ హెచ్చరించారు. పీసీపీఎన్‌డీటి సలహా సంఘ సమావేశాన్ని కొత్తపేటలోని డీప్యూటీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెనాలి డివిజన్ పరిధిలో ఉన్న స్కానింగ్ సెంటర్‌లను తరచూ తనిఖీ చేయడం జరుగుతుందన్నారు. ఎవరైనా చట్ట విరుద్ధంగా నిర్ధారణ పరీక్షలు జరిపితే సహించేది లేదన్నారు. ప్రతి స్కానింగ్ సెంటర్‌లో దీనికి సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పరిశపోగు సునీల్‌కుమార్, జిల్లా వైద్యశాల వైద్యులు డాక్టర్ వినీల్, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ సురేష్, రెడ్‌క్రాస్ సొసైటీ ట్రెజరర్ నాళం శ్రీనునారాయణ, పెనుగొండ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులు

తెనాలిఅర్బన్: కార్మికుల పని గంటలను పెంచుతూ ఈ నెల 4న జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.బి.ప్రసాద్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మారీసుపేటలోని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కార్యాలయం వద్ద మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 8 గంటల పనిదినాన్ని అంతర్జాతీయ కార్మిక సంస్థ నిర్ణయించదని గుర్తు చేశారు. పని గంటలు పెంచడం వలన కార్మికులు అనేక రకాలుగా ఇబ్బందులు పడే అవకాశం ఉందని చెప్పారు. వెంటనే దానిని ఉపసంహరించుకోవాలని కోరారు. అనంతరం అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు షేక్ హుస్సేన్ వలీ, మంగళగిరి పద్మ, దుర్గా ప్రసాద్, కె.నరసింహా రావు, కోటయ్య, సి.హెచ్.లింగయ్య, టి.సాంబ్రాజ్యం, వి.వీరమ్మ, దార్ల పద్మ, గంజి రమణ, ఎ.బాపయ్య, కోటేశ్వరి, పాములు పాల్గొన్నారు.

పుణ్యముంటుంది.. కొంతకాలం ఉంచండయ్యా!

చలివేంద్రం తొలగించాలంటూ అధికారులు హుకుం



నందివెలుగు ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన మేము సైతం చలివేంద్రం

తెనాలిటౌన్: గత 10 సంవత్సరాలుగా వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు నందివెలుగు గ్రామానికి చెందిన మేము సైతం స్వచ్ఛంద సంస్థ సభ్యులు నందివెలుగు ప్రధాన రహదారిపై చలివేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. నందివెలుగు-తెనాలి ప్రధాన రహదారిపై చిరు వ్యాపారాలు అధికమవుతుండటం వల్ల ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతుందని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆ ప్రాంతంలో ఆక్రమణలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఎంపీడీవో అత్తోట దీప్తి ఆ ప్రాంతానికి రెండుస్లారు అక్కడ వారందరితో మాట్లాడి అక్రమణలు తొలగించాలని ఆదేశించారు. అయినప్పటికి చిరువ్యాపారులు తమ కార్యకలాపాలు యథేచ్ఛగా చేస్తుండటంతో బుధవారం ప్రధాన రహదారిపై నందివెలుగు జంక్షన్‌లో ఉన్న అక్రమణలు తొలగించాలని పంచాయతీ అధికారులను ఎంపీడీవో ఆదేశించారు. ఈ క్రమంలోనే ఎక్కడో మూలన ఉన్న మేము సైతం చలివేంద్రం కూడా తీసివేయాలని అధికారులు తప్పని సరి ఆదేశాలు ఇవ్వడంతో 'మేము సైతం సభ్యులు' చలివేంద్రాన్ని ఇంకొన్ని రోజులు కొనసాగించాలని అభ్యర్థించినా ఫలితం లేకుండా పోయింది. రోహిణికార్తె ఎండలు మండుతున్నాయి. ఆ ప్రాంతంలో గుక్కెడు నీరు త్రాగేందుకు బాటసారులకు, వాహనదారులకు ఎటువంటి సౌకర్యం లేదు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని మరికొన్ని రోజులు బాటసారుల సేవార్థం చలివేంద్రాన్ని కొనసాగించాలని సభ్యులతో పాటు ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అధికారులు విజ్ఞతతో ఆలోచించి చలివేంద్రం తొలగించే ఆలోచన విరమించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రేపటి నుంచి జిల్లెళ్లమూడి అమ్మవారి అనంతోత్సవాలు

బాపట్లటౌన్: ఈనెల 12వ తేదీ నుంచి 14 వరకు జిల్లెళ్లమూడి అమ్మవారి అనంతోత్సవాలు జరుగుతాయని విశ్వజననీ పరిషత్ కోశాధికారి సుబ్రహ్మణ్యం తెలిపారు. అనంతోత్సవాల్లో భాగంగా ఈనెల 12న ఉదయం 6.30 గంటలకు అమ్మ మూలవిరాట్‌కు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ఉదయం 11 గంటలకు అన్నాభిషేకం, సాయంత్రం 7 గంటలకు అనసూయేశ్వరాలయంలో పుష్పార్చన, రాత్రి 9 గంటలకు అమ్మవారి దివ్యనామ సంకీర్తన, మహాహారతి, 13న ఉదయం 9 గంటలకు విశ్వజననీ చరితహోమం, ఉదయం 11 గంటలకు సామూహిక అంబికా లక్షనామ స్తోత్ర పారాయణం , 14న ఉదయం 10 గంటలకు సహస్ర ఘట్టాభిషేకం, సాయంత్రం ధ్యాన ఆలయంలో శ్రీ లలితా సహస్రనామ స్తోత్ర పారాయణం, మల్లెపూలతో పూలంగి సేవ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు.

రేపు తెనాలిలో డాక్టర్ వెలగా కాంస్య విగ్రహావిష్కరణ



తెనాలి: పట్టణానికి చెందిన గ్రంథాలయోద్యమ ప్రముఖుడు డాక్టర్ వెలగా వెంకటప్పయ్య కాంస్య విగ్రహాన్ని ఈనెల 12న తెనాలి బండ్‌పై ఆవిష్కరించనున్నారు. ఆరోజు ఉదయం 10 గంటలకు జరిగే విగ్రహావిష్కరణ సభకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షత వహిస్తారు. స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ఆహార, పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, పారిశ్రామికవేత్త కొత్త సుబ్రహ్మణ్యం, లంకా సూర్యనారాయణ, డాక్టర్ బీరం సుందరరావు సభలో పాల్గొంటారు. సంబంధిత ఆహ్వానపత్రికను మంగళవారం సాయంత్రం స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆవిష్కరించారు. డాక్టర్ వెలగా వెంకటప్పయ్య కుమారులు హరిసర్వోత్తమరావు, నాగార్జున, వెంకట్రావు, మానవేంద్ర, ఆదర్శ రైతుసంఘం అధ్యక్షుడు ఈదర పూర్ణచంద్, అయినాల మల్లేశ్వర రావు, పావులూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దంపతులపై మరిది కుటుంబం దాడి

తెనాలిరూరల్: దంపతులపై మరిది అతని కుటుంబ సభ్యులు దాడి చేసి గాయపర్చిన ఘటనపై కేసు మంగళవారం నమోదైంది. పోలీసుల కథనం మేరకు పట్టణ సీఎం కాలనీకి చెందిన మొగిలి కృష్ణ, అతని భార్య గంగపై కృష్ణ తమ్ముడు నాగరాజు, అతని కుటుంబ సభ్యులు పోలేరమ్మ, బాబి ఈ నెల 6వ తేదీన దాడి చేసి గాయపర్చారు. ఆస్తి వివాదం నేపథ్యంలో దాడి జరిగినట్టు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

తెనాలి మున్సిపల్ కమిషనర్‌గా చల్లా ఓబులేసు

తెనాలిఅర్బన్: పట్టణ మున్సిపల్ కమిషనర్‌గా చల్లా ఓబులేసు నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వస్తున్నారు. ఆయన గతంలో కొవ్వూరు, తుని, రామచంద్రపురం, గుంతకల్లు, శ్రీకాకుళం కార్పొరేషన్‌లో కమిషనర్‌గా పనిచేశారు. 2005లో తుని మున్సిపాలిటీ పరిధిలో జరిగిన ఎన్నికల్లో 30 నిమిషాల్లో రిజల్ట్‌ను ప్రకటించి రికార్డు సాధించారు.

డాక్టర్ జయదేవ్‌కు బంగారు పతకం



తెనాలిరూరల్: విజయవాడకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ జయదేవ్ సుదడానికి తెనాలి వైద్యులు బంగారు పతకాన్ని ప్రదానం చేశారు. బోసురోడ్డులోని ఐఎంఏ తెనాలి శాఖ కార్యాలయంలో మంగళవారం రాత్రి జరిగిన కార్యక్రమంలో పలువురు వైద్యులు పాల్గొన్నారు. డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్ ధార్మిక బంగారు పతకాన్ని అందుకున్న డాక్టర్ జయదేవ్ 'థైరాయిడ్–వైద్యుల దృక్పథం' అన్న అంశంపై ప్రసంగించారు. థైరాయిడ్ సమస్యలు ఉన్న వారికి అందించాల్సి వైద్య విధానం, ఇటీవలి కాలంలో వచ్చిన మార్పుల గురించి వివరించారు. ఐఎంఏ తెనాలి అధ్యక్షుడు డాక్టర్ కె. అనిల్‌కుమార్, డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, డాక్టర్ చందు సాంబశివుడు, డాక్టర్ సీఎస్ఆర్‌కే ప్రసాద్, డాక్టర్ మధుప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రుల సత్తాచాటిన దుగ్గిరాల గోపాలకృష్ణయ్య

ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్ సీతాభవాని



దుగ్గిరాల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి డిప్యూటీ తహసీల్దార్, ఫోరం నాయకులు

బాపట్లటౌన్: సహాయ నిరాకరణోద్యమంలో ముందడుగు వేసి, జాతీయస్థాయిలో ఆంధ్రుల సత్తాచాటిన ఘనుడు దుగ్గిరాల గోపాలకృష్ణయ్య అని ఇన్‌ఛార్జి డిప్యూటీ తహసీల్దార్ సీతాభవాని తెలిపారు. ఫోరంఫర్ బెటర్ బాపట్ల ఆధ్వర్యంలో దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వర్ధంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సీతాభవానీ మాట్లాడుతూ చీరాల–పేరాల ఉద్యమం ద్వారా దేశచిత్ర పటంలో ఈప్రాంతానికి సుస్థిరస్థానం కల్పించారన్నారు. అఖిలభారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా పని చేసిన తొలి ఆంధ్రుడు దుగ్గిరాల అన్నారు. సుశిక్షితులైన రామదండును నిర్మించి, బ్రిటిష్ వారిగుండెల్లో రైళ్లు పరిగెత్తించారన్నారు. ఆయన బాపట్ల బోర్డు స్కూలులో విద్యాభాస్యం చేయడం, 1908 ప్రాంతంలో బాపట్ల తాలూకా ఆఫీసులో గుమస్తాగా పని చేయడం బాపట్ల వాసులందరికీ గర్వకారణం అన్నారు. ఫోరం సభ్యులు ఎ. మల్లికార్జున, చిత్రకారుడు జీవీ, గురజాల శ్రీనివాసరావు, ఎం.నరసింహారావు, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది మణికంఠ, ఊహాకాంత్, కె.కోటేశ్వరరావు, జి.రాజారావు, డి.చెంచుబాబు, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సమష్టి కృషితో సమస్యలకు పరిష్కారం

ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్

చెరుకుపల్లి: మండలంలో ప్రతి గ్రామంలోని సమస్యలను ఆయా గ్రామ ప్రజా ప్రతినిధులు అధికారులు సమష్టిగా కృషి చేసి పరిష్కరించాలని ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్ అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముందుగా మండలంలో గత సమావేశం నుంచి ఈ సమావేశం వరకు మండలంలో జరిగిన పలు అభివృద్ధి పనుల గురించి శాఖల వారీగా అధికారులను విడి విడిగా అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓ–2 నవీన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులు గురించి వివరించారు. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయన్నారు. అనంతరం విద్యుత్ శాఖ డీఈఈ ఎస్.సురేష్ మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దృష్ట్యా అన్ని లైన్లు బ్రేక్ కాకుండా తగు మరమ్మతులు చేశామన్నారు. సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రానున్న వ్యవసాయ సీజన్‌లో రైతులకు సకాలంలో సాగు నీరు అందేవిధంగా ఇప్పటి నుంచే అధికారులు ప్రణాళిక సిద్ధం చేసుకుని రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఎంపీడీఓ షేక్ మహబూబ్ సుభాని, తహసీల్దార్ సీహెచ్ పద్మావతి, ఇన్‌చార్జి డీఎల్‌పీఓ కేజీఏ శ్రీనివాసన్, గోవాడ సాగునీటి డిస్ట్రిబ్యూషన్ కమిటీ చైర్మన్ ఎంఆర్కే మూర్తి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్మికులను ఆదుకోవడంలో కూటమి సర్కారు విఫలం

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కె. ధనలక్ష్మి

బాపట్లటౌన్: కార్మికులను ఆదుకోవడంలో కూటమి సర్కారు ఘోరంగా విఫలమైందని, జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి తెలిపారు. మంగళవారం బాపట్లలోని ప్రజాసంఘాల కార్యాలయంలో బాపట్ల జిల్లా విస్తృత సమావేశం నిర్వహించారు. కె.ధనలక్ష్మి మాట్లాడుతూ కేంద్రంలోని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా కార్మిక చట్టాలను మార్పు చేస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలన్నారు. కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె జరుగుతుందన్నారు. ఈ సమ్మెలో దేశంలోని స్వతంత్ర ఫెడరేషన్లయిన ఇన్సూరెన్స్, పోస్టల్, బీఎస్ఎన్ఎల్ ,డిఫెన్స్, రైల్వే రంగాల్లో సమ్మె జరగబోతుందని, సమ్మెలో 35 కోట్ల మంది పాల్గొంటారని అంచనా వేస్తున్నామన్నారు. అనేకమంది ప్రాణా త్యాగాలతో సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయటంలో కేంద్ర ప్రభుత్వ విధానాలకు కూటమి ప్రభుత్వం వత్తాసు పలుకుతుందన్నారు. నేడు విశాఖ స్టీల్ ప్లాంట్లో 5000 మంది కాంట్రాక్ట్ కార్మికులను ఒక కలం పోటుతో కేంద్ర ప్రభుత్వం, యాజమాన్యం తొలగిస్తూ ఉంటే కూటమి ప్రభుత్వం పల్లెత్తు మాట అనటం లేదని దుయ్యబట్టారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మనిలాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ మజుందార్, సీఐటీయూ నాయకులు ఎం.వసంతరావు, టి.వెంకటేశ్వర్లు, ఎం.వీరాంజనేయులు, కె.ఝాన్సీ, ఎం.వెంకటేశ్వరమ్మ, కె.శరత్ నారాయణరెడ్డి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే ఉద్యమిస్తాం

ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాశం వెంకటేష్



ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

తెనాలిఅర్బన్: కార్పొరేట్ విద్యాసంస్థల్లో అక్రమంగా ఫీజులు వసూలు చేస్తే ఆందోళన చేస్తామని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాశం వెంకటేష్ హెచ్చరించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా పట్టణంలోని పలు కార్పొరేట్ విద్యాసంస్థల వద్ద మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందస్తు అడ్మిషన్ల పేరుతో పలు ప్రవేట్ కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను దోచుకుంటున్నాయని ఆరోపించారు. అలాంటి వారిపై విద్యాశాఖ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే తక్కువ ధరకు లభించే పుస్తకాలపై కళాశాల పేరును ముద్రించి అధిక రేటుకు విక్రయిస్తున్నారని ఆరోపించారు. ఇలా చేయడం వలన పేద విద్యార్థులకు ఆర్థికంగా ఇబ్బంది పడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం పోరాటాలు చేస్తునే ఉంటుందని తెలిపారు. మద్దినేని కిరణ్‌బాబు మాట్లాడుతూ పేపరు ప్రకటనలకే మంత్రి నారాలోకేష్ పరిమితమయ్యారని ఆరోపించారు. యువగళం పాదయాత్రలో విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చెన్నూరు సాయి, భూమేష్, తేజ, కోట్లు, మణి, దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

బొల్లిముంత శివరామకృష్ణ సేవలు చిరస్మరణీయం



నివాళులర్పిస్తున్న సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్

తెనాలిటౌన్: సినీ రచయిత, అభ్యుదయవాది బొల్లిముంత శివరామకృష్ణ సేవలు ప్రజల గుండెల్లో చిరస్మరణీయమని సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్ పేర్కొన్నారు. రూరల్ మండలం కఠెవరం గ్రామంలో మంగళవారం బొల్లిముంత శివరామకృష్ణ వర్ధంతి కార్యక్రమాన్ని ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బండికళ్ళ ప్రసాద్ పాల్గొని శివరామకృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ప్రజా నాట్యమండలి కార్యనిర్వాహక అధ్యక్షులు ఎం.మాణిక్యాలరావు, దేవరపల్లి నీలాంబరం, దేవరపల్లి అభినవ్, అన్వేష్, విజయ, ప్రమీలరాణి, తదితరులు ఉన్నారు.